



# ఉత్సాహం తో నాస్తి

వాణీ ప్రసాద్

నాల్గు గంటల వేళ ఎండ తీక్షణతను తగ్గించుకుని ఆహ్లాదకరమయిన సాయంసమయాన్ని ఆహ్వానిస్తున్నది. వరండా చివరగా అందంగ, కుండీలలో అమర్చబడిన రక రకాల మొక్కలు —అప్పుడే ప్రారంభ మయిన చిరుగాలికి, చిన్నగా తలలూపు తున్నాయి.

అక్కడే పడక కుర్చీలో కూర్చుని, ఎదురుగా కుండీలో వున్న గులాబి చెట్టు వంకే చూస్తున్న కృష్ణారావుగారికి, లే లేత చిగురాకులు పసిడి పసి తనాన్ని, పచ్చని ఆకులు పరిఢవిల్లిన ఆనందమయ కాలాన్ని, పండి రాలటానికి సిద్ధంగ వున్న ఆకులు జీవిత సంధ్యను గుర్తు చేస్తున్నట్లుగ కన్పించాయి ఆ పండిన ఆకుల లానే, మనిషి జీవితం కూడ రాలిపోవటానికి కేవలం కాలమేనా కారణమయ్యేది ? అని తనలో తనే ప్రశ్నించుకుంటున్న కృష్ణారావుగారు "తాతయ్యా ! తాతయ్యా ! అమ్మ టిఫెన్‌కు రమ్మంటున్నది" అని పిలుస్తున్న మనుమ రాలు శోభ పిలుపుకి ఉలిక్కిపడ్డారు శోభ ఎప్పుడూ పిలిచే పిలుపు అయినా ఈ రోజెందుకో క్రొత్తగా విన్పించింది ఆయనకి. "తాతయ్య ", ... "తాతయ్య" ... నేను తాతయ్య నయ్యాను కదూ ! అనుకుంటు "పదమ్మా, శోభా !" అంటూ అనుస రించారు

టిఫెన్ తీసుకునేటప్పుడు శోభ వేసే ప్రశ్నలకు సమాధానాలిస్తూ ఆమె సందేహాలు తీరుస్తున్నారు. శోభ వేసిన ఒక ప్రశ్నకు, ఏదో ఆలోచిస్తున్న కృష్ణారావుగారు అన్య మనస్కంగ ఇంకేదో సమాధానం చెప్పారు. "అదేమిటి తాతయ్యా! ఇంతకు ముందు మరోలా అన్నావు కదా ?" అని శోభ నిలదీసి నప్పుడు కంగారుపడి "ఔనమ్మా, పరధ్యానంలో పొరపాటు చెప్పేసినట్లున్నాను; ఏమిటమ్మా; మళ్ళీ అడుగు" అంటు టిఫెన్ కానిచ్చేశారు. కాఫీ తాగేసి బయటికి నడుస్తున్న ఆయనకి వెనుక కోడలు సుధ "పాపా ! తాతగారిని ఎప్పుడూ ఏదో ఒకటి అడిగి విసిగిస్తావెందుకు ? పెద్దవారవు తున్నారు కదమ్మా, ఓపిక వుండదు" అంటున్న మాటలు వినిపించాయి. నేను పెద్దవాడినయ్యానా ? అనుకుంటు మళ్ళీ వచ్చి పడకకుర్చీలో కూర్చున్న ఆయనకి నిన్న కొడుకు కరుణాకర్ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి

తను బ్యాంకు లోన్ల విషయం అడిగితే, "మీ కెందుకు నాన్నగారూ ! బ్యాంకు లోన్ల సంగతులు, టెలిఫోన్ బిల్స్ సంగతులు అన్నీ నేను చూసుకుంటాను కదా ! పెద్దతనంలో హాయిగా విశ్రాంతి తీసుకోండి" అనలేదూ ?

తనకు పెద్దతనం — విశ్రాంతి.

రిటైర్ ఆయినంత మాత్రాన విశ్రాంతి తీసుకోవలసినంత వయసు వచ్చేసిందా ? ఓపిక లేనంతటి పెద్దతనం ఒక్కసారిగ ఆవరించిందా ?

ఆఖరికి మాణిక్యం, తన భార్య బాధ్య తల్లో, సుఖాల్లో, తనతోపాటే సహజీవనం సాగించిన మాణిక్యం కూడా అలా అందేమిటి ?

నాల్గురోజుల క్రితం — రాత్రి ఎందుకో నిద్రపట్టక ప్రక్కమంచం వైపు చూస్తే, మాణిక్యం కూడ తనలాగే నిద్రపట్టక మంచంపై పొర్లుతున్నట్లు అర్థమయింది. ఏదైనా కాలక్షేపపు కబుర్లు చెప్పుకుందామని మాణిక్యం మంచంపై కూర్చుంటే "ఏమిటండీ ! మంచినీళ్లేమయినా కావాలా?, అని అడిగింది. "అక్కర్లేదు మాణిక్యం, ఊరికే కూర్చున్నాను" అంటే ఏమండి మాణిక్యం—"ఊరికే కూర్చోవట మేమిటండీ,

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!
7400 TG



తాజా వార్తలకు!
ఆంధ్రపత్రిక దినపత్రిక
చదవండి!



మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులైయి ఇచ్చినయోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు. ఉచిత వివరములకు:

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,

రామాలయం వీధి, తెనాలి—2. | 2వలైను, కేదారేశ్వరపేట, విజయవాడ-3.




రిటైర్ అయి, ఇంత వయసు వచ్చి, 'హవ్వ' ముందు మీ మంచం మీదకి వెళ్ళిపోండి, ఏమైనా వుంటే తర్వాత చెప్తురుకాని ...'' అంది.

ఆ క్షణంలో నిజంగానే సిగ్గుతో చితికి పోయాడు తను. వెంటనే తన మంచంలోకి వచ్చేశాడు.

ఎన్నో సంవత్సరముల సహచర్యంతో, మరెవరితోటి వుండనంతటి సన్నిహితత్వం వున్న భార్యతో ఆత్మీయతతో, ఆపేక్షతో కబుర్లు చెప్పకోవటానికి ఒకవేళ, ఒకవయసు అంటు వుంటుందా ? శారీరకావసరం కోసమే నేను మాణిక్యం దగ్గరికి వెళ్ళానా ? ఇంతేనా నన్ను మాణిక్యం అర్థం చేసుకోగల్గింది ?

ఇంట్లో వ్యక్తులందరూ తననో శతవృద్ధంగా, విశ్రాంతి తీసుకోవలసిన వ్యక్తిగానే పరిగణిస్తున్నారు.

పరిచయస్తులు, బాగా తెలిసిన వారు, కనిపించి, ''రిటైర్ అయ్యారట కదా ? కోరినంత ఖాళీ. ఆ హర్రీ బర్రి జీవితానికి గుడ్‌బై కొట్టేశారు'' అంటున్నారు.

కాని తనకా జీవితమే హాయిగ వుండేదే ?! ఖాళీగా వుండాలని ఎప్పుడూ కోరుకోలేదే? !...

క్లబ్‌కెళ్తే ''ఏమండోయ్ రావుగారు, రిటైర్ అయ్యారట కదా ? కొడుకు ఇంజనీరు. కూతురికి పెళ్ళి చేసేశారు. ఇక హాయిగ, రాజాలా కాలుమీద కాలు వేసుకుని కూర్చోవచ్చు'' అన్నారు. కాలం వ్యర్థంగా గడపటమేనా?—రాజాలా కూర్చోవటమంటే? అది తన కిష్టంలేదే?

కృష్ణారావుగారిలా ఏవేవో ఆలోచనలతో సతమత మవుతుంటే ఆయనతో పాటే రిటైర్ అయిన ప్రకాశంగారు, మెల్లెక్కి వరండాలోకి వస్తూ ''ఏమిటోయ్ కృష్ణ పరమాత్మా! పరధ్యానంగ వున్నట్లున్నావు? ఎవరైనా వస్తే కూడ గమనించనంతటి ఆలోచన లేమిటోయ్?'' అన్నారు.

కృష్ణారావుగారు, ప్రకాశంగారు ఇద్దరూ ఒకేసారి, ఒకే స్కూల్లో ఉపాధ్యాయులుగ అడుగు పెట్టారు. సహోద్యోగులు, ఒకే వయసువారు కావటంతో ఆనాటి నుండి ఈనాటి వరకు స్నేహంగానే మసులు కుంటున్నారు

''చెస్ ఓ గేమ్ వేద్దామా? ఏం తోచటం లేదోయ్'' అన్న ప్రకాశంగారి ప్రతిపాదనకు

**రథం!**

వధువు అధిరోహించిన
రథానికి సారథి వరుడు...
వివాహ తతంగంతో
కదులుతుంది ఒక కొత్త జీవితరథం!

—ఎన్. వి. ఆర్. సత్యనారాయణమూర్తి

''ఆ, అలాగే'' అంటూ లోపలికి వెళ్ళి చెస్ సరంజామా నంతటిని పట్టుకు వచ్చారు కృష్ణారావుగారు. ఇంతలో ''ఏమండి బాబాయిగారూ ! బాగున్నారా? స్నేహితు లిద్దరూ ఒకేసారి రిటైర్ అయ్యారు ఇక హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు. ప్రస్తుతానికీ బజ్జీలే మీ కాలక్షేపం'' అని నవ్వుతూ బజ్జీల ప్లేటు అక్కడ వుంచి వెళ్ళిపోయింది సుధ.

మిత్రులిద్దరూ కాసేపు ఉత్సాహంగానే ఆడారు. మరో గేమ్‌కు పావులు వుంచేలోపల, గుర్తొచ్చినట్లుగ ''ఏమోయ్ ప్రకాశం, మీవాడికీవూరుకి ట్రాన్సఫరైట్లేనా?'' అని అడిగారు కృష్ణారావుగారు.

''ఆ! ఆ! అయిందని మొన్ననేరాశాడోయ్. ఈ నెలాఖరుకు వచ్చేస్తారు ప్రస్తుతానికి నాకేబాధలు, బాధ్యతలు లేవోయ్ పెద్దవాడు కూడ ఇక్కడే సెటిల్ అయ్యాడా, ఇహ వీడు కూడా వచ్చేస్తాడు. పిల్లలు ప్రయోజకు లయ్యారు. మనమూ రిటైర్ అయ్యాము. వయసూ మీద పడుతున్నది. ''నాన్నగారూ! ఈ పెద్దతనంలో హాయిగా విశ్రాంతి తీసు కోండి'' అని వాళ్ళంటున్నారు రెక్కలైతే వచ్చాయి కాని వాళ్ళ పకులు మాత్రం కాలేదు ఇహ మనకేం బాధోయ్? హాయిగ విశ్రాంతి తీసుకోవటమే మన పని...'' హాయిగా నవ్వేస్తూ అన్నారు ప్రకాశంగారు.

''కాని ప్రకాశం! విశ్రాంతి తీసుకోవలసి నంతటి పెద్దతనం వచ్చేసిందంటావా మనకు? మరో ప్రయోజనకరమైన పనేదైనా చెయ్యలేమా?''

''చేస్తామా? చెయ్యలేమా? అని కాదోయ్ మనం ఆలోచించాల్సింది. చెయ్యాల్సినంత పెద్ద అవసర మేముందీ అని...'' తేల్చేశారు ప్రకాశం గారు.

''మంచిపనులు చెయ్యటానికి అవసరాలు కూడ వుంటాయా ప్రకాశం? ఏమో నాకు

మాత్రం ఈ విశ్రాంతి బాధాకరంగానే వుంది."

"సర్లే నీ దెప్పుడూ వితండ వాదమేగా. ఊరందరిది ఒకదారైతే ఉలికి పిట్టది మరో దారట. అందరూ కొడుకులు సరిగాచూడటం లేదో అనో, కష్టం తప్పలేదురా భగవంతుడా అనో వాపోతుంటే నీవేమో ఇంకా ఏదో బాధ్యత నెత్తిన వేసుకోవాలనుకుంటున్నావు. సరె, సర్లే, ఐదయింది. క్లబ్ కెళ్దాం పద" అని బయలుదేర తీశారు ప్రకాశంగారు, కృష్ణారావుగారిని.

* * *

పోస్టులో వచ్చిన ఉత్తరాల్లో, సుమలత వస్తున్నట్లుగ వ్రాసిన ఉత్తరం చూసుకుని మహాసంతోషపడిపోయారు కృష్ణారావుగారు. ఇంటిల్లిపాదికి ఆనందంతో ఆ కబురు అంద చేశారు

సుమలత కృష్ణారావుగారి ఒక్కగానొక్క కుమార్తె వివాహమయి ఆనందకరమైన జీవితాన్ని అనుభవిస్తున్న అదృష్టవంతురాలు. ఎమ్ ఏ చదివిన ఉద్యోగిని.

సహజంగ తండ్రీ కూతుళ్ల మధ్య పెన వేసుకునే మమతా బంధం కంటె వారిద్దరి మధ్య గట్టి పడిన స్నేహ బంధం గొప్పది. ఒకరి విషయాలు మరొకరు, నిష్పక్షపాతంగా విమర్శనాత్మకంగ చర్చించుకోగల సంస్కార వంతులు. అందుకే కృష్ణారావుగారికి సుమలత ఆగమనవార్త అంతటి ఆనందం కల్గించింది.

* * *

సుమలతతో కుశల ప్రశ్నలు, పిచ్చాపాటి కబుర్లు అయ్యాక తనలో కలుగుతున్న బాధ నంత విప్పిచెప్పి చివరగా "సుమా! నేను, ప్రకాశం అంకుల్, ఇద్దరం ఒకే సిట్యుయేషన్‌లో వున్నాం కదా!? కాని, నాకు మాత్రమే ఈ ఆవేదన ఎందుకు కల్గుతున్న దంటావ్?" అని అడిగారు కృష్ణారావుగారు సుమలతను, పడకకుర్చీలో మరింత విశ్రాంతిగ పడుకుంటూ.

అలా ప్రశ్నిస్తున్న తండ్రి, సుమలత కళ్లకు, ఎంతో సాహిత్యాన్ని ఆకళింపుచేసుకుని చివరకు ఆల్ఫాబెట్స్ గుర్తుచేసుకోలేకపోయిన ప్రొఫెసర్‌లా కన్పించాడు.

తండ్రి ముఖంలోకి పరీక్షగా చూస్తూ "ఔను నాన్నగారు; మీకు పెద్దతనం వచ్చేసింది" అంది గంభీరంగా.

కూతురు ఇంకా ఏదో చెపుతుందని ఎదురు చూసిన కృష్ణారావుగారికి ఆశాభంగమైంది— గుర్తుగా నిట్టూర్పు విడిచారు.

"నాన్నగారూ! పెద్దతనం, వయసు మీరటం వంటి భావాలన్నీ మన మనసుల్లో నుండి పుట్టేవేనండి. రిటైర్ అయ్యారు కాబట్టి మీ వయసెంతో మీకు గుర్తుంది. అందరూ కూడా వాళ్ల సహజ ధోరణిలో మీ కదే గుర్తుచేసి విశ్రాంతి తీసుకోండి అంటున్నారు.

కాని, నాన్నగారూ! మనసులో ఉత్సాహం, చైతన్యం, ఏదైనా మంచిపని చేయాలనే తపన, శరీరారోగ్యం వున్నంతకాలం పెద్దతనం మన దరిదాపులకేరాదండి అయినా వృద్ధాప్యం ఒక శాపం కాదుగా నాన్నగారూ! ఒక జీవన పరిణామం మాత్రమే. గతించిన విలువయిన జీవితానికి, అనుభవాల పరిపక్వతకు నిదర్శనం మాత్రమే.

మీలో ఇంకా ఉత్సాహం, చైతన్యం ప్రవహిస్తున్నాయి. ఆరోగ్య లోపంలేదు, కాబట్టే అందరూ "మీకు వయసు మీరింది, విశ్రాంతి తీసుకోండి" అన్నప్పుడు మీకు బాధ కల్గుతున్నది.

ఎవరికి వారు శారీరక, మానసిక విశ్రాంతిని




శుభవార్త

తలనొప్పి, కడుపునొప్పి, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, ఫిట్సు, స్త్రీల ముట్టుకుట్టు నొప్పి, సుఖ వ్యాధులు, మూత్ర వ్యాధులు, చక్కెర వ్యాధి, మూలశంఖ, పిల్లలు లేకపోవుట, దాంపత్య సుఖ లోపం మొదలైన వ్యాధులను, మా వైద్యశాల ప్రధాన వైద్యులు డాక్టర్ **ఎన్. ఎస్. రావు** గారు నాడీ పరీక్షతో వైద్యము చేయుదురు.

పరీక్ష ఫీజు రు. **15/-** వ్యాధినిబట్టి చికిత్సకు చార్జి చేయుదురు. మందులు వారే ఇస్తారు.

NB : పేదల వైద్యము నెలకు రు **15/-**. రెండు మాసములమందు ఒకేసారి తీసుకొనవచ్చును.


క్యాంపుల వివరం : డిశంబరు, ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలలో

హైదరాబాద్ : ప్రతినెల 1, 2, 3 తేదీలు : జయా లాడ్జి
మహబూబ్‌నగర్ : 4 వ తేది : గణేష్ భవన్.
కర్నూలు : 5 వ తేది : ఉడిపి హోటల్ (పెద్ద మార్కెట్‌వద్ద).
గుంతకల్ : 6 వ తేది : శ్రీ లాడ్జి.
కడప : 7 వ తేది : ద్వారకా లాడ్జి.
తిరుపతి : 8 వ తేది : హోటల్ విక్రం, R.T.C. బస్సుస్టాండ్ ఎదుట.
మద్రాసు : 10, 11 : తేదీలు : కోమల విలాస్, నెం. 12, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీటు, (జి.టి.) హైకోర్టు ఎదురుగా.
నెల్లూరు : 12 వ తేది : రాఘవ విహార్.
గుంటూరు : 14 వ తేది : శ్రీకృష్ణ భవన్. (స్టేషన్ రోడ్)
రాజమండ్రి : 16, 17 తేదీలు శాంతి నివాస్.
కాకినాడ : 18 వ తేది : ద్వారకా లాడ్జి.
వైజాగ్ : 20, 21 తేదీలు : బృందావన్ లాడ్జి (డాబా గార్డెన్స్).
విజయవాడ : 24 వ తేది : మాడరన్ కేఫ్, గాంధినగర్.
ఖమ్మం : 25 వ తేది : మయూర్ కేఫ్ (శేష్‌మహల్ లాడ్జి)
వరంగల్ : 26 వ తేది : హోటల్ నటరాజ్.
హైదరాబాద్ : 27వ తేది నుండి హెడ్డాఫీసు.

సంప్రదించు కాలము : ఉ. 7 గంటలనుండి సా. 4 గంటల వరకు * నిరుద్యోగులకు, ఉద్యోగులకు శుభవార్త : పై సెంటర్సులో స్త్రీలు, పురుషులు ఏజంట్సుగా పనిచేసి, నెలకు రూ. 500 లు నుండి రూ. 1000 ల వరకు సంపాదించండి.

డాక్టరును సంప్రదించండి :

**ఎన్. ఎస్. రావూస్ క్లినిక్,** ప్లాట్ నెం. 471, జూబిలీహిల్సు రోడ్ నెం. 36, హైదరాబాద్—500034.



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## వేదముల విశిష్టత

భారతీయ వాఙ్మయంలో వేద వాఙ్మయం అతి ప్రాచీనమైనది. యుగయుగాల నుంచీ వస్తూ ఉన్నది. ఇతర వాఙ్మయాలకూ, దీనికీ ఎంతో వ్యత్యాసం ఉన్నది ఇవి విని గ్రహించ వలసినవేకాని తక్కిన వాటివలె వ్రాతకు సాధ్యం కావు. అందువల్లనే వేదాలకు శ్రుతులనే పేరు వచ్చింది.

"ఆ మాటకు తిరుగులేదు" అనే అభిప్రాయాన్ని "వేదవాక్కు" అని చెప్పడం పరిపాటి. అందువల్ల వేదాలు ప్రభువు శాసించే రీతిని విధించేవేగాని హితాన్ని మృదుమార్గాన బోధించేవి కావు.

వేదాలను వ్రాసే పద్ధతి మొదటలేదు. తర్వాత తర్వాత తాళపత్రాల పయి ఎక్కించడం జరుగుతూ ఉండేది. ఇప్పుడు అచ్చుపడి కూడా వస్తున్నవి. అయితే మామూలుగా పుస్తకాలను చదివినట్లు వ్రాతలోగాని, ముద్రణలోగాని ఉన్న వేదాలను చదివితే ప్రయోజనం లేదు. వాటికి స్వరం ప్రధానం: స్వరయుక్తంగా ఉన్నప్పుడే అవి ప్రయోజన సహితాలై ఉంటాయి. వాటికి ఉదాత్త–అనుదాత్త– స్వరితాలని మూడు విధములైన స్వరాలుంటాయి. ఆ స్వరాలకు అచ్చులో గుర్తులు ఉంటాయి. కాని సస్వరంగా గురుముఖాన వేదాధ్యయనం చేసిన వారికి గాని, ఆ గుర్తులు ఉపయోగించవు.

మనకు సంగీత గ్రంథాలు ఉన్నవి. వాటిని చదువుకుంటే సంగీతం వస్తుందా? స రి గ మ ప ద ని– అనే సప్తస్వరాల ఆరోహణావరోహణలను గురు ముఖంగా నేర్చుకుంటేనే గాని గాన విద్య పట్టు పడదు గదా!

సంగీతంలో స్వరాలు తప్పిపోతే గానం మాధుర్యాన్ని కోలుపోయి కొంత కఠోరంగా వినపడుతుంది. వేదంలో స్వరం తప్పిపోతే అర్థమే మారిపోతుంది. అనర్థానికి దారి తీస్తుంది. వేదాధ్యయనం సంగీతంకంటే కూడా కష్టసాధ్యం. నియమానుసారంగా–. సస్వరంగా వేద మంత్రాల అభ్యసనానికి చాలా ఏళ్లు పడుతుంది. కేవలం కంఠస్థం చేయడం వల్ల ప్రయోజనం ఉండదు పరిశుద్ధ మనస్సుతో సస్వరంగా వేదమంత్రాలను ఉచ్చరించిన యెడల మంత్ర నిర్దిష్టమైన ప్రయోజనం తప్పక నెరవేరుతుంది. ఆ పేరు శ్రేయమైన వేదం యొక్క ప్రభావం గొప్పది.

## ఉత్సాహంతో నాస్తి...

కోరుకున్నప్పుడే నిజమయిన వృద్ధాప్యం వస్తుంది. దానికి వయసే ప్రత్యేక కారణం కాదు నాన్నగారూ!

ఇక ప్రకాశం అంకుల్ అంటారా? ఆయన మీలా ఆలోచించటం లేదు. చేసిన పన్లు చాలు; ఇక ఏ బాధ్యత నెత్తిన వేసుకోను అని నిర్ణయించుకున్నారు. కాబట్టే నిశ్చింతగా విశ్రాంతి తీసుకోదల్చుకున్నారు. మీ, మీ, అభిప్రాయాల్లో వున్న తేడాలే మీ మనస్తత్వాలను విప్పి చెప్తున్నవి కదండి.

అయినా నాన్నగారూ! మీరు ఎంతోమంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందించారు ఇప్పుడు ఇంత చిన్న విషయాన్ని ఓ సమస్యగా నా ముందుంచారు. అందుకే మొదట "మీరు నిజంగానే పెద్దవారయ్యారు" అన్నాను.

అప్పట్లో మీరేదో వ్రాస్తుండేవారు కదండీ? దాన్నే కొనసాగించండి. మీ అనుభవాల ద్వారా, కొన్ని సమస్యలకు ఓ మంచిమార్గాన్ని ప్రజల కళ్లముందుంచండి, లేదా;

ఏ స్కూల్లో విద్యార్థులయినా, తగిన ఉపాధ్యాయుడు లేక బాధ పడుతుంటే, అక్కడ ఆనరరీ జాబ్ చెయ్యండి. మీరింకా పని చేయదల్చుకుంటే, ఇంటి విషయాల్లో మీర్బాధ్యతను అందరూ కోరుకుంటే, బయటి ప్రపంచంలో ఎన్నో మంచి పనులు మీ కళ్ల ముందు కదులుతాయి. మీ చేయూతను ఆశిస్తాయి" అంది సుమలత తండ్రికి నచ్చ చెప్తున్నట్లుగ.

ఇంతలో "లతా!" అని విన్పించిన తల్లి పిలుపుకు "అమ్మ ఎందుకో పిలుస్తున్నది నాన్నగారూ! మళ్ళీ వస్తాను" అని లోపలికి వెళ్ళిపోయింది.

అవును సుమ మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం. ఈనిజం యింత కాలంగ నాకు తోచలేదేమిటి? నాకు నిజంగానే పెద్దతనం వచ్చేసిందా? అని తనలో తనే నవ్వుకున్నారు కృష్ణారావుగారు.

ఎదురుగా వున్న గులాబి చెట్టులో పండుబారిన ఆకులు ఆయనకీసారి రాలిపోయే ఆకుల్లా కన్పించలేదు.

ఆకుపచ్చని ఆకులకు తమ అనుభవాన్ని, పెద్దరికాన్ని, విప్పి చెప్తున్న అనుభవజ్ఞుల్లా కన్పించాయి.

ఇప్పుడవి ఆయనకు "జాతస్య మరణం ధ్రువం"కు సంకేతాలుగా కన్పించటం లేదు.

"ఉత్సాహంతో నాస్తి వృద్ధాప్యం" అన్న కొత్త అర్థాన్ని స్ఫురింప చేస్తున్నాయి.